నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామక్రిష్ణ సంపుటి: 3 సంచిక: 217 శుక్రవారం, 29 నవంబర్, 2024 పేజీలు - 4 వెల : 3/-






## సీఎం సాబ్ సమాధానం చెప్పండి

- రేవంత్‌కు కిషన్ రెడ్డి ప్రశ్నలు
- తెలంగాణలో ప్రాజెక్టుల అమలు కోసం సమర్థవంతంగా, ప్రొయాక్టివ్‌గా పనిచేయాలని ప్రధాని మోడీ సూచించారు
- ప్రజాసమస్యల మీద ఎప్పుడూ దృష్టి పెట్టాలని.. ప్రభుత్వంతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు

న్యూఢిల్లీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన బీజేపీ పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులతో కలసి మోడీ దగ్గరకు వెళ్లారు కిషన్ రెడ్డి. ఈ భేటీ విశేషాలను ఆయన ప్రెస్ మీట్‌లో పంచుకున్నారు. తమకు కలిసే అవకాశం ఇవ్వాలని గత పార్లమెంటు సమావేశాల

# మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్

- రెండు పార్టీలకు చెందిన నేతలు మాటల యుద్ధానికి దిగుతున్నారు.
- లగచర్ల అల్లర్ల ఘటన వంటి అంశాలపై ఇప్పటికే బీఆర్ఎస్ దూకుడుగా వెళుతోంది
- మరో వైపు రేవంత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ మాటల దాడికి ప్రతి దాడి చేస్తూనే ఉన్నారు
- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ఇప్పటి దాకా పక్కన పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టనుందా అన్న చర్చ సాగుతోంది




హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీల మధ్య రోజు రోజుకు పొలిటికల్ వార్ తీవ్రమవుతోంది. రెండు పార్టీలకు చెందిన నేతలు మాటల యుద్ధానికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనపైన, ఇచ్చిన హమీల అమలు, హైడ్రా పేరుతో అక్రమ కట్టడాల కూల్చివేత, ఇళు కూలిన బాధితుల విషయాలు, లగచర్ల అల్లర్ల ఘటన వంటి అంశాలపై ఇప్పటికే బీఆర్ఎస్ దూకుడుగా వెళుతోంది. మరో వైపు రేవంత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ మాటల దాడికి ప్రతి దాడి చేస్తూనే ఉన్నారు. అయితే ఇక ఇప్పుడు మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ కు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందా అన్న చర్చ సాగుతోంది. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ఇప్పటి దాకా పక్కన పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టనుందా అన్న చర్చ సాగుతోంది. కేసు పూర్వాపల్లోకి వెళితే.. తెలంగాణలో జరిగిన శాసన సభ ఎన్నికల తర్వాత గులాబీ పార్టీ బీఫాం అందుకుని గెలిచిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ లు కాంగ్రెస్ లో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని



## అదానీని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?

- అదానీ జైల్లో ఉండాలన్న రాహుల్ గాంధీ
- కేంద్రంలోని కొందరు పెద్దలు అదానీని కాపాడుతున్నారని విమర్శ
- లంచాల ఆరోపణలను అదానీ ఒప్పుకోరని వ్యాఖ్య
- పార్లమెంట్ ఉభయ సభలను కూడా అదానీ అంశం కుదిపేస్తోంది.

## ఇస్రో శుక్రయాన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

- 2028లో ఇస్రో శుక్రయాన్ మిషన్
- సింథటిక్ ఎపర్చర్ రాడార్, ఆల్ట్రావైలెట్ ఇమేజింగ్ సిస్టమ్ తదితర అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో శుక్రుడి వాతావరణంపై పరిశోధన
- దట్టమైన కార్బన్‌డయాక్సైడ్, సల్ఫ్యూరిక్ ఆమ్లం, క్రియాశీల అగ్నిపర్వతాలను గుర్తించడంతో పాటు గ్రహం భౌగోళిక కార్యకలాపాలను అంచనా వేయడం మిషన్ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి.
- రాబోయే దశలో రెడ్ ప్లానెట్ చుట్టూ పరిభ్రమించడంతో పాటు ఉపరితలంపై ల్యాండింగ్‌కు ప్రయత్నం



## నిర్మల్‌లో సంబురాలు.. టపాసులు కాల్చి మరీ..

- దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు
- ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో స్థానికుల నిరసన
- నిన్న, ఉద్రిక్తంగా మారిన నిరసన కార్యక్రమం
- స్థానికులతో చర్చలు జరిపిన కలెక్టర్



నిర్మల్

రెండు రోజులుగా స్థానికుల ఆందోళనలతో అట్టుడికిన నిర్మల్‌లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది. మహాధర్నాతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన జనం ఒక్కసారిగా టపాసులు కాల్చిమరీ సంబురాలు చేసుకున్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య చేపట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం నుంచి రెండు గ్రామాల మహిళలు ఆందోళనకు దిగారు. 61వ జాతీయ రహదారిపై బైఠాయించారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే తమ ఎజెండా అంటూ మహాధర్నా చేపట్టారు. ఎన్నికలకు ముందు ఇథనాల్ పరిశ్రమ రద్దుకు కృషి చేస్తామని చెప్పిన ముగ్గురు నాయకులు ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులతో అధికారులు చర్చలు జరిపినా సఫలం కాలేదు. దీంతో విషయాన్ని ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. ప్రస్తుతానికి ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో



## మోదీ నిర్ణయమే ఫైనల్

- మహారాష్ట్ర సీఎం పదవిపై ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు
- పోరాటం తన రక్తంలోనే ఉంది
- మహాయుతి గెలుపు కోసం కార్యకర్తగా పనిచేశా
- ఒక కార్యకర్తలా చెప్పులు అరిగేలా తిరిగా
- తన దృష్టిలో సీఎం అంటే కామన్ మ్యాన్

## దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు



- మహారాష్ట్రలో మాత్రమే బీజేపీ గెలుపు
- కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవు: భట్టి విక్రమార్క
- మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- ప్రతిపక్షాల పసలేని విమర్శలతో ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాఖ్య
- మూసీ నిర్వాసితులు వ్యాపారం చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తామని హామీ

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. తమలో విభేదాలు అంటూ పసలేని విమర్శలు చేస్తే ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది కాకుల్లా అరుస్తున్నారని విమర్శించారు. మంత్రివర్గ విస్తరణ విషయమై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా, మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకోవడానికి రుణ



## హేమంత్ సోరెన్ ప్రమాణస్వీకారం ఫిక్స్

- నవంబర్ 28వ తేదీ గురువారంనాడు ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు
- కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సహా 'ఇండియా' కూటమికి చెందిన అగ్రనేతలు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు.
- కొత్తం ప్రభుత్వంలో ఆర్జేడీకి ? ఒక సీటు దక్కే అవకాశం

## తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గితే కిరీటం ఏమీ పడిపోదు

- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురక
- ఆదానీ కోసం.. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- అమాయకులైన గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా లాక్కునే కుట్రలకు ఇప్పటికైనా తెరదించాలి

హైదరాబాద్

దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగివచ్చిన సీఎం రేవంత్ రెడ్డి లగచర్లలో కూడా లెంపలేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వెంటనే లగచర్లలో అల్లుడి కోసం.. ఆదానీ కోసం.. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా లాక్కునే కుట్రలకు ఇప్పటికైనా తెరదించాలని కేటీఆర్ అన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాలని సూచించారు. ఢిల్లీలో రైతుల సంఘటన శక్తిలో ఉన్న బలం ముందు దేశ ప్రధాని కూడా చివరికి వెనక్కి తగ్గిన చరిత్ర మన కళ్ల ముందు ఉందని తెలిపారు. అనాలోచిత నిర్ణయాలతో మొన్న



# సంపాదకీయం

## తరం తరం ఒక కొత్త చరిత్ర

మనకు తెలిసినదే వాస్తవమని, ఆ తెలిసిన దానిలో మనకు నచ్చినదే జీవిత సత్యమని నమ్మే భావన ఒక సామాజిక అవగాహనగా దాదాపు మనందరిలోనూ స్థిరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ భావనలు పాక్షికమైనవి. మనకు తెలిసినదే వాస్తవమని, ఆ తెలిసిన దానిలో మనకు నచ్చినదే జీవిత సత్యమని నమ్మే భావన ఒక సామాజిక అవగాహనగా దాదాపు మనందరిలోనూ స్థిరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ భావనలు పాక్షికమైనవి. వాస్తవానికి భిన్నమైనవి. ప్రతి అంశానికి విరుద్ధమైన పూర్తి వ్యతిరేకమైన అంశం మరొకటి వుండి తీరుతుంది. ఈ నియమం జీవరాశులకు మాత్రమే కాక, మనం సాధారణంగా నిర్జీవరాశులుగా భావించే రాళ్ళు, రప్పలు, ఖనిజాలు, యంత్రాలకు కూడ వర్తిస్తుంది. ప్రపంచంలో ప్రతీదీ నిరంతరం విరుద్ధ అంశాల పరస్పర సంఘర్షణ లోనే ముందుకు సాగుతుంటుంది. చరిత్ర గమనాన్ని అవగాహన చేసుకునేందుకు మనకు అనేక పనిముట్లు అందుబాటులో వున్నాయి. అసలు పనిముట్ల ఆధారంగానే మానవ చరిత్రను వివరించే విధానం ఒకటుంది. పాత రాతియుగం, మధ్యరాతి యుగం, కొత్త రాతియుగం, కంచు యుగం, ఇనుము యుగం, పురాతన యుగం, మధ్య యుగం మొదలుకుని ఇప్పటి డిజిటల్, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు పనిముట్ల వినియోగం ఆధారంగా మానవ సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని వివరించవచ్చు. రాజులు, చక్రవర్తులు... వాళ్ళ కులమతాలు, అనుసరించిన పరిపాలనా విధానాల ద్వారా కూడ చరిత్రను వివరించే పద్ధతులు కొన్ని ఉన్నాయి. చరిత్ర అంటే గతం అనుకుంటాంబీ నిజానికి అది వర్తమానం కూడ కాదుబీ భవిష్యత్తు!. భవిష్యత్తును నిర్మించుకునే లక్ష్యంతోనే మనిషి గతం నుండి కొన్ని అనుభవాలను, పరికరాలను ఎంచుకుంటాడు. 'రేపు–నిన్న –రేపు' అనేది చరిత్ర రచన క్రమానికి సమీకరణం. ప్రతిలోనూ మంచీ వుంటుందిబీ చెడూ వుంటుంది. భావి రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం గత చరిత్రను వక్రీకరించే పద్ధతులు ఇప్పుడు చురుగ్గా పనిచేస్తున్నాయి. మధ్యయుగాల్లో ముస్లిం పరిపాలకులు హిందువులను హింసించారని ఒక అభియోగాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టి, ఇప్పుడు ముస్లింలను రాజకీయార్థిక సాంస్కృతిక రంగాల్లో హింసించి ప్రతీకారం తీసుకుంటామని శపథాలు చేస్తే ఓటర్లలో ఓ మూడవ భాగమైనా ఉత్తేజితులై బలపరుస్తారు. అలా అధికారం సులువుగా దక్కుతుందనేది ఆధునిక రాజకీయార్థిక చరిత్ర రచన ఫార్మూలా. మూడవ భాగం అనేది అల్పసంఖ్య. అయితేనేం? మల్టీపార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మూడవ భాగం ఓట్లు మాత్రమే వచ్చినా సరే తిరుగులేని విజయం అని చెప్పుకునే అవకాశం వుంది.'చరిత్ర తనంతతానుగా పునరావృతం అవుతుందిబీ మొదటిసారి విషాదంగానూ, రెండోసారి ప్రహసనంగానూ' అన్న కార్ల్ మార్ఖ్ వ్యాఖ్య చాలామందికి తెలుసు. ఆయన చరిత్ర గురించి ఇంకా చాలా చాలా అన్నాడు. పునరావృతం అవ్వడం అంటే జరిగిన సంఘటనలే సరిగ్గా అలాగే మళ్ళీమళ్ళీ జరుగుతాయని కాదుబీ వాటి స్థాయీ పెరుగుతుందన్నాడు. సంఘటనలు గతానికి విరుద్ధంగా పునరావృతం అవుతాయనే అర్థమూ అందులో వుంది. వలస పాలన కాలం ఎలావున్నా ఆధునిక చారిత్రిక ఘటనలకు అనివార్యంగా రాజ్యాంగంతోనూ, కొత్త చట్టాలతోనూ ఒక సంబంధం వుంటుంది. రాజ్యాంగం మీద ఒక్కో చారిత్రక సందర్భంలో ఒక్కో అభిప్రాయం వెలువడుతూ వుంటుంది. ఇవి పరస్పరం వ్యతిరేకంగానూ వుంటాయి. రాజ్యాంగసభను బ్రిటీష్ పాలకులే ఏర్పాటు చేశారు కనుక అది వలస రాజ్యాంగం అనేవారున్నారు. భారత రాజ్యాంగం గొప్ప ప్రజాస్వామికమైనది అనే వారున్నారు. కొందరు ఒక అడుగు ముందుకేసి అది సామ్యవాదాన్ని ఆకాంక్షిస్తుంది అంటుంటారు. దాన్ని పెట్టుబడిదారుల రాజ్యాంగం అనేవారూ వున్నారు. రాజ్యాంగ రచనే ఒక కుట్ర అన్నవారూ వున్నారు. ఎమర్జెన్సీని మించిన క్రూరమైన చట్టాలతో పీడిత ప్రజల్ని నిరంతరం పరమ కిరాతకంగా చంపేయడానికి రాజ్యాంగం దోహదపడుతుందనేవారూ వున్నారు. రాజ్యాంగం గాంధీజీ– అంబేడ్కర్‌ల మార్గంలో అహింసను ప్రోత్సహిస్తుంది అనేవారున్నారు. 'దేవతలు నివసించడానికి ఒక ఆలయాన్ని నిర్మిస్తే దెయ్యాలు దాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పుడు ఆ ఆలయాన్ని నాశనం చేయడం తప్ప మనం ఏమి చేయగలం?' అని ఓ సందర్భంలో అంబేడ్కర్ వాపోయారు. రాజ్యాంగానికి ఎంత చెదపట్టినాసరే ఇప్పటికి అదే మనకు గతి అనేవారూ వున్నారు. సామాజికార్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు సాయుధులై తిరగబడతారని అంబేడ్కర్ ఎలాగూ హెచ్చరించాడు. రాజ్యాంగం అంటే రాజ్యపు అంగం అనేది నిఘంటువు అర్థం. రాజ్యం అంగిబీ రాజ్యాంగం దాని అంగం. ప్రజల ఆందోళనలు, ఉద్యమాలు, పోరాటాల ఆధారంగా ఇటు సమాజంలో అటు ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పుల్ని వివరించడం చరిత్ర రచనలో ఇంకో పద్ధతి. అయితే ఇందులో కూడ ఒక తిరకాసు వుంది. ప్రజాందోళనలు సాధించిన విజయాలు కూడ ఒక దశ తరువాత తిరుగుముఖం పడతాయి. ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలో రాచరిక %–% భూస్వామ్య వ్యవస్థ మీద పెట్టుబడిదారులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన దేశంలో రాచరిక –భూస్వామ్య వ్యవస్థ మీద కొన్నిచోట్ల కమ్యూనిస్టులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన భూస్వాములు యూరోపియన్ భూస్వాములకన్నా బాగా తెలివైనవారు. పెట్టుబడిదారులతో తలపడితే తమ పతనం తప్పదని తెలుసుకుని వాళ్ళే పెట్టుబడిదారులైపోయారు. ఈ పరిణామాన్ని రాజ్యాంగ సభలోనే చూడవచ్చు. సభ్యుల్లో అత్యధికులు రాచరిక – భూస్వామ్య వ్యవస్థ ప్రతినిధులు. అయినప్పటికీ వారు అత్యంత ఆధునిక రాజ్యాంగానికి ఆమోదం తెలిపారు. 1970లలో రాజభరణాలు రద్దు, భూపరిమితి చట్టం, బ్యాంకుల జాతీయకరణ, అటవీ భూములపై ఆదివాసులకు ప్రత్యేక హక్కులు వగైరా ప్రజాస్వామిక చట్టాలు వచ్చాయి. ఇవన్నీ నక్సలైట్ సాయుధ పోరాట విస్తరణకు భయపడి రూపొందించిన చట్టాలే. ఆ మేరకు అవి ప్రజా విజయాలే. అయితే, రాజ్యం తన స్వభావాన్ని భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ దిశగా మార్చుకోవాలనుకోవడం కూడ దీనికి మరో కారణం తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు భూస్వాములు ముదిరి పెట్టుబడిదారులయ్యారు. పెట్టుబడిదారులు ముదిరి కార్పొరేట్లు అయ్యారు. వాళ్ళు ముదిరి మెగా కార్పొరేట్లయ్యారు. వాళ్ళు తిమింగలాలను మించిపోయారు. బ్లూ వ్హేల్, లివియాథాన్ వంటివన్నమాట. తెలుగులో తిమింగలగిలం అంటారు. వాళ్ళకిప్పుడు అలనాటి జమిందారులు, జాగీర్దారులు ఆ మాటకొస్తే చక్రవర్తులకు వుండినంత భూమి కావాలి. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మూడు వేల ఎకరాల భూమి కావాలి. స్టీల్ ప్లాంటుకు ముప్పయి వేల ఎకరాలు కావాలి. ఇంకో ప్రాజెక్టుకు మొత్తం నికోబార్ ద్వీపం కావాలి. ఇంకొకరికి మొత్తం మిజోరాం, మణిపూర్ రాష్ట్రాలు కావాలి. వాళ్ళ కోసం అటవీ భూముల పరిరక్షణ చట్టాల్ని పార్లమెంటు సవరిస్తుంది. అలా 1970వ దశాబ్దంలో వచ్చిన ప్రజాస్వామికం అనుకునే చట్టాలన్నీ ఒకదానివెంట మరొకటి రద్దయిపోతాయి. లేదా శవపేటికలో వుండిపోతాయి. '%ఖఅ–ఒశీఅఅస్త్ర్ ష్ట్రవ ఒశీఅఅస్త్ర%' అన్నమాట. ఇవన్నీ దేశాభివృద్ధి పేరిటే జరుగుతాయి. దేశాభివృద్ధి మంత్రం ముందు మరేదీ నిలవదు. ఇంతకీ దేశాభివృద్ధి అంటే ఏమిటీ? ఎవరి నిర్వచనం వారిది. దీపావళికి ముందు బంగారం ధర పెరుగుతుంటుంది. ఆ ఊపులో అవసరానికి మించి పెరిగిపోతుంది. దీపావళి తరువాత ధర తగ్గుముఖం పడుతుంది. ఆ నైరాశ్యంలో అవసరానికి మించి తగ్గిపోతుంది. మళ్ళీ సంక్రాంతికి ధర పెరుగుతుంది. మించి తగ్గుతుంది. స్టాక్ మార్కెట్‌లో షేర్లు కూడ అంతే. పెరిగేటప్పుడూ అతిశయమే తగ్గేటప్పుడూ అతిశయమే.

# పెను సవాళ్ళకు దారితీయనున్న వర్గీకరణ ప్రయత్నాలు

'కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?' శీర్షికన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ రాసిన వ్యాసంలో (24–10–2024) ఆయన మాలలపై అక్కసుతో అబద్ధ ప్రచారాల పరంపరను మరోసారి కొనసాగించారు. గత ఆగస్టు ఒకటో తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇచ్చిన తీర్పు కక్షిదారులకన్నా దాని ప్రభావిత వర్గాలను తీవ్రమైన ఆందోళనకు గురిచేసింది. ప్రధానంగా ఉత్తర భారత దళితులు ఈ తీర్పును అంగీకరించేది లేదని ఆందోళనలు చేస్తున్నారు. తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన భారత్ బంద్‌లో ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా మాదిగ సామీప్య కులం లాంటి చమార్ కులస్తులు అధికంగా ఉన్న ప్రాంతాలలో, విజయవంతం కావడమే అందుకు నిదర్శనం. తీర్పుపై వేసిన అనేక రివ్యూ పిటీషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిజానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఇచ్చిన ఏ తీర్పుపై కూడ రివ్యూ పిటీషన్లను ఆయన అనుమతించలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ల భవితవ్యంపై నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నది. నిజానికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయిన తర్వాత వర్గీకరణ డిమాండ్‌కు మునుపటి ప్రాధాన్యత లేకుండే. కాని 2023 నవంబర్ 11న సికింద్రాబాద్ సభలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలో రాజీవ్ గౌభా నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత అన్నీ చకచకా జరిగిపోయినవి. ఇరవై సంవత్సరాల అనంతరం అనూహ్యంగా 2024 ఫిబ్రవరి 6న సుప్రీంకోర్ట్ రివ్యూ పిటిషన్‌ను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేసింది. వర్గీకరణ వాదులకు రెండురోజులు, వ్యతిరేకులకు ఒకరోజు మాత్రమే వాదనలను అనుమతించడంతోనే రాబోయే తీర్పును చాలామంది ముందుగానే ఊహించినారు. ఇది ఖచ్చితంగా రాజకీయ ప్రేరేపిత తీర్పు. 565 పేజీల తీర్పును క్షుణ్ణంగా పరిశీలిస్తే, అనేక సంక్లిష్ట అంశాల ప్రస్తావన కూడా తీర్పులో ఉంది. ఎస్సీ ఎస్టీ ఉపకులాలు సజాతీయులు కారంటూ, ఎస్టీ వర్గీకరణను కూడా ఉటంకిస్తూ క్రీమీలేయర్ ప్రస్తావన తెచ్చింది. 'ఎంపరికల్ డాటా' అధారంగా అనేది అనేక సంక్లిష్టతలతో కూడుకొన్నది. దీని ప్రకారం ముందుగా జనాభా లెక్కలు తీయాలి. ఇది కేంద్ర ప్రభుత్వం మాత్రమే చేయాలి. 2011 జనాభా లెక్కల అనంతరం రాష్ట్రం విడిపోయింది కాబట్టి ప్రజల వలసలు జరిగిన నేపథ్యంలో పాత లెక్కలు రెండు రాష్ట్రాలకూ ఎంతమాత్రం ప్రామాణికం కాజాలవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన 2014 నుంచి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన సుమారు పదహారు రకాల స్కీముల ఆర్థిక ప్రయోజనాలు పొందిన లబ్ధిదారుల కులం లెక్కల సేకరణ, ప్రకటన జరగాలి. సుప్రీం తీర్పులో జనాభా, నిష్పత్తి పంపిణీ ప్రస్తావన లేదు. అయినా జనాభా శాతం కన్నా ఎక్కువ పొందినవారిని వెనుక వరుసలోను, తక్కువ ప్రయోజనం పొందిన వారిని ముందు వరుసలోను ఉంచడమే సహజ న్యాయం. డేటాలో తేడాలు ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్ళవచ్చు అని తీర్పులోనే సూచించింది. ఇదంతా 'ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా' జరగాలని కూడా పేర్కొంది.

అసలు అన్నింటికీ మించి ఉమ్మడి రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యోగాల స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఆర్టికల్ 371డి పరిష్కరించడం న్యాయశాఖకు ఒకపెద్ద సవాలే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అమలవుతున్న జిల్లా జోనల్ మల్టీ జోనల్ స్థాయి కేటగిరీ పోస్టుల్లో వర్గీకరణ ఎలా చేస్తారనేది మిలియన్ డాలర్ ప్రశ్న. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుకు వెళ్తే గతంలో మాలలకు 6శాతం, మాదిగలకు 7శాతం కేటాయించిన వాటాలను అలాగే కొనసాగించాలి. ఏ గ్రూపుకు 1శాతం, డి గ్రూపుకు 1శాతం, రెండు గ్రూపులకు కేటాయించిన వాటాలను కలిపి ఏ గ్రూపుగా 2శాతం, ఉషామెహ్రా కమిషన్ రిపోర్ట్ పేజీ 54 ప్రకారం తెలంగాణలో మాదిగలకన్నా వెనుకబడిన మాలలను బీ గ్రూపుగా 6శాతం, దగా పడ్డామంటూనే అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన ఉన్న మాదిగలను సీ గ్రూపుగా 7శాతం నిర్ణయించి కేటాయించడమే శాస్త్రీయ వర్గీకరణ అవుతుంది. పంజాబ్ రాష్ట్రంలో అమలవుతున్న 25శాతం ఎస్సీ రిజర్వేషన్లను ఏ %–% బీ అనే రెండు గ్రూపులుగా మాత్రమే వర్గీకరించిన అంశాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి. 1965లో బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాల కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగించమని సిఫారసు చేసిందంటూ కృపాకర్ రాసిన రాతలు అబద్ధం. అలాంటి డిమాండ్ అర్థరహితమైనదని 116 పేజీల బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టు పేజి నెంబర్ 56లో తిరస్కరించింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇటువంటి అబద్ధపు రాతలు రాస్తూ, మాదిగ శ్రేణులను రెచ్చగొడుతూ, సమాజాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గం. సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది.

మంత్రివర్గ ఉపసంఘంలో ఇప్పటివరకు అగ్రభాగ ఫలాలు అనుభవించిన కులాల ప్రతినిధులను సభ్యులుగా ఉంచడం ఎవరి మెప్పుకోసమో కాలమే సమాధానం చెప్తుంది. ఏనుగును ఏడుగురు గుడ్డివారు ఏడురకాలుగా వర్ణించినట్లు వర్గీకరణ తీర్పును పలువురు పలురకాలుగా వక్రీకరిస్తున్నారు. చికిత్స చేసేముందు రోగనిర్ధారణ చేసి చికిత్సకు పూనుకోవాలి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా చికిత్సకు ఏర్పాట్లు చేసి రోగనిర్ధారణ ప్రయత్నాలు చేస్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు.

# పోలీస్ రాజ్యం ఎవరిదో ప్రజలింకా మర్చిపోలేదు!

అప్పుడప్పుడు దెయ్యాలు వేదాలు వల్లిస్తుంటాయి. నరరూప రాక్షసులు మానవత్వంపై ప్రవచనాలు వినిపిస్తుంటారు. అబద్ధాలకోరులు నిజాలను భుజాలపై నిలబెడుతున్నామంటూ గప్పాలు కొడుతుంటారు. నియంతలు ప్రజాస్వామ్యానికి కాపాలా కుక్కలమంటూ భుజాలు చరుచుకుంటారు. అవినీతిపరులు నీతినిజాయితీలకు నిలువుటద్దాలమంటూ స్వోత్కర్షలకు పాల్పడు తుంటారు. పదేళ్ల పాటు కిరీటం లేని చక్రవర్తిలా, యువరాజులా గుర్తింపు పొందిన కేటీఆర్ వీటన్నింటికీ అసలు సిసలు ప్రతిరూపం. తమ పాలన స్వర్ణయుగమనీ తమ పాలనా కాలంలో అవలంబించిన విధానాలతోనే తెలంగాణ పారిశ్రామిక అనుకూల రాష్ట్రంగా మారిందని అధికారంలో ఉన్నప్పుడూ, అధికారం కోల్పోయిన తర్వాతా కేటీఆర్ పలు వేదికలపై చెప్పుకొచ్చారు. అదే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తుంటే అడ్డుకునే కుట్రలకు తెరలేపారు. పరిశ్రమలకు భూ సేకరణ ఎక్కడైనా కొంత ఇబ్బందులతో కూడుకున్నదే. ఏళ్లుగా భూమిని నమ్ముకున్న రైతులు వాటిని వదులుకునేందుకు ఇష్టపడరు. ఆ అనుబంధాన్ని పూడ్చలేకపోయినా భూమికి సరైన నష్ట పరిహారం ఇచ్చి మరోచోట భూమి కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే లగచర్లలోనూ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణకు ప్రభుత్వం ప్రయత్నించింది. రైతుల్లో కొంత ఆందోళన ఉన్నా పరిశ్రమ ఏర్పాటు ఆవశ్యకత, కలిగే లబ్ధి, భూములు కోల్పోయే వారికి ఇచ్చే పరిహారం తదితర అంశాలపై చర్చించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడకు వెళ్లారు. ముందుగా పన్నిన కుట్ర ప్రకారం ఆయనను గ్రామం లోనికి పిలిపించిన బీఆర్‌ఎస్ గూండాలు కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడడంతో పాటు వారి వాహనాలను ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో సెంటు భూమి లేని ఓ గుండా నేతృత్వంలోని అల్లరిమూక అధికారులపై దాడులకు తెగబడింది. దీనిని ఖండించాల్సిన కేటీఆర్ భూ నిర్వాసితులపై కేసులు పెడుతున్నారంటూ, ఆడవారిని లైంగిక వేధింపులకు గురి చేశారంటూ, దళితులూ గిరిజనులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ తప్పుడు ఆరోపణలతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు గుండెలు బాదుకుంటూ తిరుగుతున్నారు. తమ పార్టీ నేతలు కుట్రపూరితంగా చేసిన వ్యవహారాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త కొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు. దాడులకు తెగబడిన బీఆర్‌ఎస్ అరాచక ముఠా నాయకుడు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పదులసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ లేవని బుకాయిస్తున్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఒక హాస్యాస్పదమైన ప్రకటనను కేటీఆర్ చేశారు. పోలీసు రాజ్యం గురించి బీఆర్ఎస్ పాలకులకు, కేటీఆర్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పోలీస్ రాజ్యానికి తార్కాణంగా నిలిచిన ఉదంతాలు గత పదేళ్ళ పాలనలో లెక్కలేనన్ని జరిగాయి. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో రోజుల తరబడి సాగుతున్న ఇసుక దోపిడీని పండగ రోజైనా ఆపమని అడిగిన నేరెళ్ల దళితులను రాత్రిళ్లు ఇళ్ల నుంచి ఎత్తుకువెళ్లి రోజుల తరబడి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. మా సమస్యలు చెప్పుకుంటాం ధర్నా చౌక్‌కు వెళ్లనివ్వాలని కోరిన వర్గాలను ఇళ్లలో నుంచి బయటకు రానివ్వకుండా నిర్బంధించారు. ప్రతిపక్ష నేతలు, వివిధ రంగాల ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు పొందారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మిర్చి పంటను తక్కువ ధరకు దోచుకోవడంపై ఆందోళన చేసిన గిరిజన రైతులకు ఉగ్రవాదుల మాదిరి సంకెళ్లు వేసి నడిపించారు. దళిత మహిళ మరియమ్మను లాకప్‌లో చంపారు. ప్రతిపక్ష నేతలు రేవంత్‌రెడ్డి, జగ్గారెడ్డిల ఇళ్లలోకి అర్ధరాత్రులు చొరబడి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ఇంటి తలుపులను గొడ్డళ్లతో నరికి ఆయనను అరెస్టు చేశారు.



నోరెత్తిన నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులపై కేసులపై కేసులు మోపి జైళ్లకు పంపారు. ప్రశ్నించిన మీడియాను వంద అడుగుల లోతున పాతరేస్తామని రంకెలు వేశారు. అధికారం పోయిన ఏడాదిలోనే ఇన్ని తప్పులను కేటీఆర్ మర్చిపోయారా? లేక ప్రజలకు ఆ మాత్రం జ్ఞాపకశక్తి ఉండదనే చిన్నచూపుతో 'పోలీసు రాజ్యం' అన్న పదం వాడారా? ఆయనకే తెలియాలి. మానవ హక్కులు, జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ బీసీ కమిషన్, రాజ్యాంగ విలువలూ అంటూ తనకు బొత్తిగా తెలియని, తానెప్పుడూ విలువ ఇవ్వని అంశాలపై కేటీఆర్ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తున్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుడు ఆరె కనకరాజు మృతదేహాన్ని గ్రామానికి తరలించకుండా హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు జరిపించినప్పుడు కేటీఆర్‌కు మానవ హక్కులు గుర్తుకు రాలేదా? నేరెళ్ల బాధితులను రోజుల తరబడి హింసించినప్పుడు, కేసుల నుంచి తన వారిని తప్పించేందుకు వారిని బ్లాక్‌మెయిల్ చేసినప్పుడు జాతీయ ఎస్సీ కమిషన్ గుర్తుకురాలేదా? పోడు భూములు సాగు చేస్తున్నారంటూ ఖమ్మం జిల్లా ఎల్లన్న నగర్‌లో 18 మంది గిరిజన మహిళలు, అందులో ఏడాది లోపు పిల్లలున్న ముగ్గురు తల్లులను అరెస్టు చేయించి జైళ్ల పాలు చేసినప్పుడు మానవత్వం, మానవ హక్కులు, జాతీయ ఎస్టీ కమిషన్, పోలీసు రాజ్యం... ఇవేమీ కేటీఆర్‌కు గుర్తులేవా? ఢిల్లీకి మూటలు మోస్తున్నారని పదే పదే కేటీఆర్ విమర్శలు చేయడం పరమ ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణలో దోచుకున్న వందల కోట్ల రూపాయలతో దేశవిదేశాల్లో కేటీఆర్ కుటుంబం వ్యాపారం చేస్తోందనే ఆరోపణలున్నాయి. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో దిగి వంద కోట్ల రూపాయలు చేతులు మారడంలో కింగ్‌పిన్ కల్వకుంట్ల కవిత అని సీబీఐ, ఈడీ తమ ఛార్జిషీట్లలో పేర్కొన్న విషయం కేటీఆర్‌కు తెలియదా? ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే కేటీఆర్ కుటుంబం మూసివేసిన ధర్నా చౌక్‌ను తిరిగి తెరిపించారు. ఆ ధర్నా చౌక్‌లో కూర్చొనే కేటీఆర్, ఆయన బావ హరీశ్‌రావు తిట్ల పురాణం వినిపిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోలీసు రాజ్యంపై నమ్మకం లేనందునే కేటీఆర్ సోషల్ మీడియా కాలకేయ సైన్యం నిత్యం ఆయనపై, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో విషం చిమ్మగలుగుతోంది. ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే ఇంకా బీఆర్ఎస్ మాజీ మంత్రులు, కార్యకర్తలు ఇష్టారీతిగా విమర్శలు చేయగలుగుతున్నారు. కానీ ఆయన మంచితనాన్ని చేతగానితనంగా, సహనాన్ని అసమర్థతగా భావిస్తే అంతకన్నా మూర?త్వం మరొకటి ఉండదు. ప్రతిపక్ష నేతగా ఎన్నికైన కేటీఆర్ తండ్రి కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై గోరంత విశ్వాసం లేదు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పోలీసు రాజ్యం అనే పదాలు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. కేటీఆర్ కుటుంబ అహంకారాన్ని, నాటి పోలీసు రాజ్యాన్ని చూసినందునే ప్రజలు శాసనసభలో వారిని ఓడించి పదవులు ఊడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నాకు పరిమితం చేశారు. కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఇకనైనా ప్రజాస్వామిక స్ఫూర్తిని అలవర్చుకోకుంటే బీఆర్ఎస్ పార్టీ మనుగడే ప్రమాదంలో పడుతుంది.

# సాధారణ ఎలక్షన్ ను తలపించిన భాగ్యరధి ఎలక్షన్స్...




కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు చింతల్ లోని భాగ్యరధి జూనియర్ కళాశాల లో విద్యార్థులకు ఎలక్షన్ విధానం తెలియజేయుటకు మరియు మాక్ అసెంబ్లీ పెట్టి అందులో సీఎం రోల్, ప్రతిపక్ష పార్టీ లీడర్, మరియు స్పీకర్ రోల్ చేయుటకు ప్రత్యక్షంగా ఎలక్షన్ నిర్వహించడం జరిగింది.. అందుకుగాను ఆరుగురు సీనియర్ విద్యార్థులు అర్జున్ మౌర్య డి.ప్రేమ్ కుమార్, ఎం.సాయి చరణ్ ,మహమ్మద్ అఫ్రోజ్ మహమ్మద్ తాజుద్దీన్ , మహమ్మద్ బిలాల్ ఎలక్షన్ లో పోటీ చేయడం జరిగింది. 22-11-24 నుండి25-11-24 వరకు నామినేషన్ సమర్పించారు. 26-11-24 సింబల్స్ కేటాయించడం మరియు ప్రచారం చేసుకోవడం జరిగింది. 27-11-24 నా బ్యాలెట్ పేపర్ మరియు సీక్రెట్ బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగు సీనియర్ బాయ్స్ వినియోగించుకోగా 245 మంది విద్యార్థులలో 175 మంది ఓటింగ్ లో పాల్గొనడం జరిగింది. ఉదయం10 గంటల నుండి 12 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగింది. 12 గంటల తర్వాత బ్యాలెట్ బాక్స్ తెరిచి కౌంటింగ్ ప్రారంభించగా మహమ్మద్ తాజుద్దీన్ కు 81 ఓట్లతో ప్రథమ స్థానంలో సీఎం అభ్యర్థిగా ఎంపిక కావడం జరిగింది. డి .ప్రేమ్ కుమార్ 36 ఓట్లతో ద్వితీయ స్థానంలో ప్రతిపక్ష లీడర్ గా మహమ్మద్ బిలాల్ 26 ఓట్లతో స్పీకర్ ఎంపిక కావడం జరిగింది. ఓటింగ్ లో పాల్గొన్న విద్యార్థులు అందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం పరచడం జరిగింది. మాక్ అసెంబ్లీ జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి విద్యార్థులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎన్.వెంకట్ రెడ్డి ,సిహెచ్.గోవిందరెడ్డి జి.రమేష్ బాబు, కె.రామకృష్ణ, నల్ల జై శంకర్ గౌడ్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు...

# మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన శ్యామల వెంకటేష్...



కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన సామల వెంకటేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్యామల వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ కులస్తుల సంక్షేమం కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మేడ్చల్ జిల్లా లోని అందరు బిసి కులస్తులను సంఘటితం చేసి బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బిసి లకు న్యాయబద్ధంగా రావలసిన హక్కుల సాధన కోసం అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.

# హత్య.... ఆత్మహత్య....?




తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ : మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి శివారు హల్దీ వాగులో గుర్తుతెలియని అనుమానాస్పద మగ వ్యక్తి (30) వాగులో శవం ఉందన్న సమాచారంతో సంఘటన స్థలానికి వెల్లిన పోలీసులు... హల్ది వాగులో గుర్తు తెలియని శవం ఉందన్న సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, సీఐ రంగాకృష్ణ , ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి మెడకు చున్ని మరియు, వైరు తాడుతో బిగించి ఉందని మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతుడిని ఎవరైనా హత్య చేసి ఇక్కడ వాగులో పడేసారా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు తెలిపారు, మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపిన పోలీసులు.. మృతుడిని ఎవరైనా గుర్తు పట్టినట్లయితే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలిపారు.

# 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- ఎన్.శంకర్, మండల విద్యాధికారి,**



సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్ సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో గల రవీంద్ర మోడల్ ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలలు, గవర్నమెంట్ న్యూ హై స్కూల్ మరియు న్యూప్రాథమిక పాఠశాల కోహిర్ బేస్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు, రెండు ఉన్నత పాఠశాలలో గల 10వ తరగతి విద్యార్థులకు, వార్షిక పరీక్షలపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు విషయాలవారీగా తగు చర్యలు తీసుకోవాలని తెలుపడం జరిగిందని న్యూ ప్రాథమిక కోహిర్ బేస్ పాఠశాల మరియు రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్.ఎల్.ఎన్ లో భాగంగా ప్రాథమిక అంశాలు తరగతి వారిగా తెలుగు, ఇంగ్లీష్ చదివించి, వ్రాయించడం జరిగిందని మరియు గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయించడం జరిగిందని, అదేవిధం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే సమయంలో పాత్రలు మరియు వడ్డించేవారు శుభ్రతను పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల ఆవరణ ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలపడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిజాముద్దీన్,రవీంద్రనాథ్, రాజు,సరిత,అక్బర్, సిఆర్పి రాజేశ్వర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.



# నేడు మరకత శివాలయంలో అన్నదానం చేయనున్న సీత ప్రయాణం కృష్ణతో చిత్ర నిర్మాతలు



శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్బీ ఖుషి టాకీస్ ఫౌండర్ అండ్ కో ఫౌండర్ డా. రోజా భారతి అండ్ రాజీవ్, సీత ప్రయాణం కృష్ణ తో చిత్ర నిర్మాతలు నేడు (శుక్రవారం) మరకత శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని రోజా భారతి కోరారు.

# గండిమైసమ్మ లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే దీక్షా దివాస్

**- సంబు ప్రభాకర్ ఆధ్వర్యంలో**

**- మేడ్చల్ జిల్లా బి ఆర్ టి యూ అధ్యక్షులు**



మేడ్చల్ వాస్తవ తెలంగాణన్యూస్ ప్రతినిధి శివకుమార్, ఈ రోజు 29 - 11 - 2024 శుక్రవారం ఉదయం 09 గంటలకు గండిమైసమ్మ లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే దీక్షా దివాస్ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా బి ఆర్ టి యూ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అభిమానులు తప్పకుండా హాజరు కాగలరని కోరుతున్నాము..

# లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



రామగుండం,వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి రాజు:గురువారం రోజు స్థానిక గౌతమ్ నగర్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ సోమవారపు లావణ్య ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం రేకుర్తి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు ఈ వైద్య శిబిరంలో సుమారు వందమంది శిబిరంలో పాల్గొనగా వారికి షుగర్ మరియు బిబి టెస్టులను చేసి నేత్ర వైద్య శిబిరము లో 20 మంది వారికి ఆపరేషన్ కొరకై రేకుర్తి కంటి ఆసుపత్రికి ఆపరేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మగువ ప్రెసిడెంట్ సునీత, బీనా, తిరుమల,సత్గుణ, స్వరూప,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నాగరంలో ఈ రోజు కరెంట్ కూ అంతరాయం...



కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ.. 29.11.2024 ఉదయము 10:30 గంటల నుండి మధ్యాహ్నం 04:00 గంటల వరకు ఫీడర్ నిర్వహణ పని, చెట్ల కొమ్మలను కత్తిరించడం మరియు 33/11 కేవీ నాగారం సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కేవీ గాంధీ నగర్ ఫీడర్ పై డిటీఆర్ నిర్వహణ పనుల కారణంగా సరఫరా ప్రభావిత ప్రాంతాలు:- గాంధీ నగర్, మాదిరెడ్డి మల్లా రెడ్డి కాలనీ, బీఎంఆర్ ఎన్క్లేవ్, వెస్ట్ గాంధీ నగర్, భవానీ నగర్ మరియు శివాలయం లోని గల ప్రాంతాల్లో కరెంట్ కూ అంతరాయం కలుగుతుంది అని విద్యుత్ సంబంధిత అధికారులు తెలిపారు.

## 16 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసినా చైర్మన్ చంద్రారెడ్డి..



కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెం.13 లోని భవాని నగర్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.16.00 లక్షలతో చేపట్టుతున్న సి సి రోడ్డు నిర్మాణానికి నాగారం చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్ మరియు కాలనీ వాసులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా గోదావరి నదిమతల్లికి మహా హారతి కార్యక్రమము



రామగుండం,వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి రాజు:సమ్మక్క సారలమ్మ జాతర స్థలంలో గోదావరి తీరాన ఘనంగా గోదావరి నదిమతల్లికి మహా హారతి కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించడం జరిగింది. హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆహ్వాన సమితి అధ్యక్షులు డా,శ్రీనివాస్ గారు, ప్రధాన కార్యదర్శి గైనకాలజిస్ట్ డా, లక్ష్మీ వాణి గారు, డెంటిస్ట్ రమ్య చిరంజీవులు నదిమ తల్లి హారతుల కార్యక్రమం లో పాల్గొని హారతులు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ నదులు పూజనీయమైనవని భారతీయ సంస్కృతిలో ప్రకృతిలోని ప్రతిదీ భగవత్ స్వరూపముగా భావిస్తుంటారని ప్రాణం ఉన్నను ప్రాణం లేకపోయిననూ రాయి రప్ప చెట్టు పుట్ట ను పూజించడం భారతీయ సనాతన ధర్మంలో అంతర్భాగమని ఆ విధంగా నదీ జలాలను పూజించే సంస్కృతి రుగ్వేదము నుండి భారతీయులు అవలంబిస్తూ వస్తున్నారని ఈ విధమైన సంస్కృతి పరంపర వేల సంవత్సరాల క్రిందటనే ప్రారంభమైందని నలంద తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాలు ప్రపంచానికి జ్ఞాన భిక్ష ను అందించినవని దురదృష్టవశాత్తు 800 సంవత్సరాలు మొగులుల, మరియు విదేశీ పరిపాలనలో భారతీయ సంస్కృతిని జీవన విధానాన్ని విధ్వంసం చేశాయని అన్నారు. డాక్టర్ క్యాస జయశ్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ నదిహారతుల కార్యక్రమం ఇంత బాగా నిర్వహిస్తారని అనుకోలేదని 13 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా కొనసాగడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ లక్ష్మీవాని డాక్టర్ దేవతా రమ్య చిరంజీవి మాట్లాడుతూ కార్తీక మాసోత్సవంలో మహిళలు దీపారాధన చేయడం శుభప్రదమని చిన్నప్పటి నుంచి మన తల్లులు మనకు నేర్పి ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు ఈసంపల్లి వెంకన్న, కృష్ణమూర్తి ఉత్సవ సమితి నాయకులు నలుమాసు సత్తయ్య, తాటిపల్లి వెంకన్న, గుండ మంజుల, అశోక్ రావు, కోడూరి రమేష్, అంశాల వీరేశం,ఆవునూరు శ్రీనివాస్,భాగ్యలక్ష్మి, రంగ రజిత, యాద మమత,కృష్ణప్రియ, పద్మ, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నుండి రాత్రి వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో ఒజ్జల వెంకటేశ్వర శర్మ నేతృత్వంలో ముందుగా నదిమాతకు పూజ అనంతరం సారే చీర సమర్పించిన వేద పండితులు గోదావరి తల్లికి నక్షత్ర హారతి, కర్పూర హారతి, ధూప హారతి, ఏక హారతి ఇవ్వడం జరిగింది.

# మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి



మేడ్చల్,వాస్తవ తెలంగాణ న్యూస్: మేడ్చల్: పూడూరు చౌరస్తాలో ఉదయం 6 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, రావల్ కోల్ గ్రామానికి చెందిన నాగరాజు(34) ఉదయం 6 గంటల సమయంలో రాజ బొల్లారంలోని స్థానిక మోనార్కు కంపెనీకి వెళ్తుండగా పూడూరు చౌరస్తాలో పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న డీసీఎం బైక్ పై వెళుతున్న నాగరాజు అనే వ్యక్తిని ఢీకొనడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు ఇట్టి విషయమై పోలీసులకి స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసూ వారు కేసు నమోదు చేసుకుని బాడీని పోస్టుమార్టం నిమిత్తము హాస్పటల్ కి తరలించారు.

# మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే



పటాన్ చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని నీలం మధు నివాసంలో జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని గురువారం పూలే చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు విద్య, మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి ఫులే అని, ఆయన దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



జిన్నారం,వాస్తవ తెలంగాణ న్యూస్: మత్స్యకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీల మధు ముదిరాజ్ అన్నారు. గురువారం జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకర బోయిన మహేష్ ఆధ్వర్యంలో మత్స్య సంఘం భవనం ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

# సౌత్ జోన్ పోటీలకు గీతం కబడ్డీ జట్టు



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్: ప్రతిష్టాత్మకమైన దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ 'కబడ్డీ మహిళా చాంపియన్ షిప్ 2024-25'లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బాలికల జట్టు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు క్రీడల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి గురువారం విడుదల చేసిన ఒక వెల్లడించారు. ఈ చాంపియన్ షిప్ తమిళనాడులోని కరైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2వ వరకు జరుగుతుందన్నారు.

# భోజనం నాణ్యతగా లేకుంటే కఠిన చర్యలు: కలెక్టర్ వల్లూరు క్రాంతి



పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్: గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే కఠినతీసుకుంటామని కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. పటాన్ చెరు మండలం ఇంద్రేశంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను గురువారం అకస్మికంగా పరిశీలించారు. గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు కిటికీలకు తలుపులు బిగించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యేక అధికారులు తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# ఖేలో ఇండియా గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్

# దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు

-మొదటిపేజీ తరువాయి
సదుపాయం కల్పిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైడ్రా, మూసీ విషయంలో పూర్తిగా ఆలోచించాకే ముందుకు పోతున్నామన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు వేలాది ఎకరాలు కాజేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు కాజేసిన భూముల వివరాలను బయటకు తీస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ ను అగౌరపరిచేలా మాట్లాడడం కేటీఆర్ కు తెలిసిన సంస్కృతి అని.. ఆయన చెప్పినట్లు వినకపోతే ఏ మాట పడితే ఆ మాట అనేస్తారా అంటూ తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన భట్టి విక్రమార్క.. దేశంలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాల్ని సాధిస్తుందని, బీజేపీ పనైపోతుందని వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ ఒటమిని ముందుపెట్టి చూపిస్తున్నారని.. మరి జార్ఖండ్ లో అద్భుత ఫలితాల్ని ఎందుకు చూడలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ మంచి ఫలితాల్నే సాధిస్తుందని చెప్పిన భట్టి విక్రమార్క.. కర్ణాటకలో, కేరళ లో గెలిచింది కాంగ్రెస్ పార్టీనే అంటూ గుర్తు చేశారు. ఒక్క మహారాష్ట్రను మాత్రమే పరిగణలోకి తీసుకోవడమేంటని, వెస్ట్ బెంగాల్ లో, మధ్య ప్రదేశ్ లో గెలిచింది కాంగ్రెస్ కూటమి పార్టీలే అంటూ గుర్తు చేశారు. అన్ని చోట్ల ఒకే పార్టీ ఉండాలనే ఆలోచన ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, అలాంటి ఆలోచనలు కాంగ్రెస్ పార్టీ చేయదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే దేశంలో బీజేపీ పతన



మొదలైనట్లు కనిపిస్తుందని, కాంగ్రెస్ క్రమంగా పుంజుకుంటుదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక విషయాలపై లోతైన కసరత్తులు చేస్తుందన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక విషయాల్ని వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే విషయమై.. త్వరలోనే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమవుతారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చినట్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల్లోని లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని వెల్లడించిన భట్టి విక్రమార్క.. ఇందిరమ్మ ఇళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామంటూ ప్రకటించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిపిన ఉప ముఖ్యమంత్రి.. రైతు భరోసా విధివిధానాలపై త్వరలోనే స్పష్టతనిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో నూతన రేషన్ కార్డులను అందించలేదని కానీ ఇప్పుడు తమపై విమర్శలు చేస్తుండడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ప్రజలకు రుణమాఫీ చేస్తామని హామి ఇచ్చి గెలిచిన బీఆర్ఎస్ ప్రజల్ని మోసం చేసిందని అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ హామి ఇచ్చినట్లుగా 15 రోజుల్లోనే రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేసి చూపించిందని.. అర్హులైన అందరికీ కచ్చితంగా మాఫీ అందిస్తామని తెలిపారు. దేశంలోని ప్రజల్ని మతాల పేరిట భారతీయ జనతా పార్టీ విడదీస్తుందన్న భట్టి విక్రమార్క.. రాహుల్ గాంధీ మాత్రం ప్రజల్ని కలపాలనే సంకల్పంతో ఉన్నారని తెలిపారు. దేశ ప్రజలకు ఎవరి నిష్పత్తి ప్రకారం వారికి ప్రయోజనాలు చేకూర్చేందుకు కులగణన తీసుకువచ్చారని వెల్లడించారు. తెలంగాణాలో ఎవరి కులం ఎంత మేర ఉందనేది.. ప్రస్తుత సర్వే తర్వాత తెలుస్తుందన్న భట్టి విక్రమార్క, అవసరమైతే ఈ విషయమై డిబెట్ పెడదామని అన్నారు. ప్రభుత్వ అధికారులంతా తాము ఏది చెబితే అది వినాలని కేటీఆర్ భావిస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. అందుకే.. జిల్లా కలెక్టర్ ని పట్టుకుని సన్నాసి అంటూ తిట్టారని, ఆయనకు మర్యాద తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు బీఆర్ఎస్ పార్టీ చెప్పినట్లు వినరని, వాళ్లు చట్టం, నిబంధనల ప్రకారం వెళతారని తెలిపారు. కొద్ది రోజులుగా కేటీఆర్ ఏది పడితే అది మాట్లాడుతున్నారని, ఆయనలా ప్రజా ప్రభుత్వంలో నిర్బంధ ఆంక్షలు లేవని తెలిపారు. తాము నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని అన్నారు. గౌతమ్ అదానీ వ్యవహారంపై విచారణ జరగాలి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురుకులాల నిర్వహణపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్న ఉప ముఖ్యమంత్రి.. తమను రాజకీయంగా విమర్శించేందుకు గురుకులాల్ని అడ్డం పెట్టుకోవద్దని హితవు పలికారు.

# నిర్మల్‌లో సంబురాలు.. టపాసులు కాల్చి మరీ

-మొదటిపేజీ తరువాయి
మహాధర్నాను విరమిస్తున్నట్లు ఆందోళనకారులు ప్రకటించారు. తాత్కాలికంగా ఆందోళన విరమిస్తునట్టు ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ నేతలు ప్రకటించారు. కలెక్టరేట్ లో జేఏసీ నేతలతో సమావేశమైన కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపి వేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టర్ హామీకి నాయకులు సంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఉద్యమాన్ని తాత్కా లికంగా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వానికి, అధికారులకు అన్ని విధాలా సహకరిస్తామని, పరిశ్రమను ఇక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలని ఉద్యమ నేతలు కోరారు.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తమ ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమ వద్దని స్థానికులు కొన్ని రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈరోజు వీరితో చర్చలు జరిపిన కలెక్టర్... పరిశ్రమ పనులకు బ్రేక్ ఇస్తున్నట్లు చెప్పారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ వారికి చెప్పారు. ఈ క్రమంలోనే పరిశ్రమ పనులు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇదిలా ఉండగా, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన అనుమతులను పునఃసమీక్షించాలని నిర్ణయించుకుంది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకునే దిశగా పరిశీలన చేస్తోంది. అవసరమైతే ఈ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని భావిస్తోందని సమాచారం.

ఇథనాల్ పరిశ్రమకు అనుమతులు రద్దు చేయాలంటూ నిన్న



గ్రామస్థులు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారి తీసింది. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా స్థానికులు నిర్మల్ - భైంసా రహదారిపై నిరసన చేపట్టారు. పలువురు మహిళలు పురుగుల మందు డబ్బాలతో నిరసన చేపట్టారు. పరిస్థితులు చేజారకుండా కొంతమందిని ముందస్తుగా అరెస్ట్ చేశారు. పలువురు నిరసనకారులు పోలీసులపై దాడి చేశారు. వారి వాహనాలపై రాళ్లు రువ్వారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది.

**ప్రభుత్వ ప్రకటనతో సంబురాలు..**

ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కలెక్టర్, ఎస్పీలతో చర్చలు సఫలం కావడంతో టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హామీతో మహాధర్నాను స్థానికులు విరమించారు. స్థానిక ప్రజల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుందని, భవిష్యత్తులో కూడా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగించే, కాలుష్య పరిశ్రమలు ఈ ప్రాంతానికి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

**అసలు ఏం జరిగింది..**

ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిరసనకారులతో మాట్లాడేందుకు దిలావర్‌పూర్‌కు వచ్చిన ఆర్డీవో రత్న కళ్యాణిపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ 10మంది గ్రామస్థులను చర్చలకు రమ్మంటున్నారని ఆర్డీవో చెప్పారు. తామున్న దగ్గరకే కలెక్టర్ రావాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆర్డీవో తిరిగి వెళ్లే క్రమంలో కారులో ఎక్కేందుకు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. కలెక్టర్ వచ్చే వరకు వెళ్లనిచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో ఆర్డీవో రాత్రి వరకు కారులోనే ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆర్డీవో రత్నకళ్యాణి ఆరోగ్యం క్షీణించడంతో రాత్రి 9 గంటలకు వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాత్రి 10 గంటల వరకు నిరసనకారుల నిర్బంధంలో ఉన్న ఆర్డీవో రత్న కళ్యాణిని విడిపించేందుకు నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో పోలీసులు వలయంగా ఏర్పడి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆందోళనకారులు ఆర్డీవో కారును ధ్వంసం చేశారు. పోలీసులు అతి కష్టం మీద ఆర్డీవోను పోలీసు వాహనంలో నిర్మల్‌కు తరలించారు. మహిళల ఆందోళన నేపథ్యంలో దిలావర్‌పూర్‌ను పోలీసులు అష్ట దిగ్బంధం చేశారు. చుట్టూ రోడ్లు మూసివేసి, తనిఖీలు చేపట్టారు. పరిశ్రమ నిర్మాణం వైపు ఎవరినీ వెళ్లనీయకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక బలగాలను రప్పించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఉదయం నుంచి దిలావర్‌పూర్‌లోనే ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు.. ఎస్పీతోనూ వాగ్వాదానికి దిగారు. దీంతో వారికి ఎస్పీ సర్దిచెప్పారు. చివరకు ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపివేయాలని ఆదేశించడంతో ఆందోళనకారులు శాంతించారు.

# మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్

-మొదటిపేజీ తరువాయి
కోరుతూ బీఆర్ఎస్ స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. తెలంగాణఅసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, వివేకానంద రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపుపై సుప్రింకోర్టు మార్గదర్శకాలను స్పీకర్ అమలు చేయడం లేదని ఆ పిటిషన్ లో పిటీషనర్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. దీంతో అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టుడివిజన్ బెంచ్ ను ఆశ్రయించడం జరిగింది. అయితే దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ ఇరువర్గాల వాదన విన్న తర్వాత తన తీర్పును ప్రకటించింది. రీజనబుల్ టైంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు పై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని తన తీర్పులో పేర్కొంది. అంటే స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు స్పష్టంగా ఎలాంటి గడువు విధించకపోవడం తో ఇక ఇప్పుడు ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై తుది నిర్ణయం స్పీకర్ ఎప్పుడు తీసుకుంటారన్న స్పష్టత లేదు. ఇప్పటి వరకు హైకోర్టు నిర్ణయం పైవేచి చూసిన కాంగ్రెస్ పార్టీ ఇక ఇప్పుడు ఆపరేషన్ ఆకర్షక్ కు తెర లేపుతుందన్న వాదనలు వినవస్తున్నాయి. తన ఢిల్లీ పర్యటన లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా కుటుంబ సభ్యుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలోనే కాంగ్రెస్ హై కమాండ్ తోను ముఖ్యమైన విషయాలు చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అందులో మంత్రి వర్గ విస్తరణ ఒకటి కాగా, మరో అంశం ఆపరేషన్ ఆకర్ష్. దీనికి కాంగ్రెస్ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వెంటనె బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే దిశగా చర్యలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. గతంలోనే పలువురు మంత్రులు 20-25 మంది గులాబీ ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని, వాళ్లు వస్తే ఇక బీఆర్ఎస్ లో మిగిలేది కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా మరో ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే అని చెప్పిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ హైకమాండ్ తో ఈ తాజా పరిణామాలన్నీ చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ దూకుడు తగ్గించేందుకు శీతాకాల అసెంబ్లీ సమావేశాల ముందే కొద్ది మందిని పార్టీలో చేర్చుకోవాలా లేక జీహెచ్ఎంసీ ఎన్నికల ముందా అన్న చర్చ జరుగుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు టార్గెట్ గా ఆపరేషన్ ఆకర్ష్ జరుగుతుందని చెబుతున్నారు. శాసన సభ ఎన్నికల్లో తెలంగాణ రూరల్ లో కాంగ్రెస్ కు ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. కాని గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ చతికిల పడింది. కంటోన్మెంట్ కు జరిగిన ఉపఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ ఒక్క స్థానంలో గెలిచింది. దీంతో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి నజర్ పెట్టారు. అయితే గ్రేటర్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాసం ఉండటంతో శీతాకాల సమావేశాల ముందే ఈ ప్రక్రియ ఉండవచ్చన్న వార్తలు వస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటయి దాదాపు ఏడాది కావోస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి ముఖ్యమంత్రితో కలిపి 18 మందితో మంత్రి మండలి ఏర్పడాల్సి ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి సహా 12 మంది మాత్రమే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాది నుండి 12 మందితోనే రేవంత్ సర్కార్ పాలన సాగిస్తోంది. మరో ఆరుగురు మంత్రులుగా ఎంపిక కావాల్సి ఉంది. అయితే ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా ఆరు మంత్రి పదవులు ఉద్దేశపూర్వకంగానే అలా అట్టిపెట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీలో చేరిన ఒకరిద్దరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు ఆ ఎమ్మెల్యేలు తమ సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. మరికొందరు పార్టీలోకి రావాలంటే మంత్రి పదవుల తాయిలం చూపించాల్సిన అవసరం ఉంది. అందుకోసమే పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణ చేయకుండా ఆగారని అటు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపాలంటే జీహెచ్ఎంసీ పరిధిలో మరి కొందరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను పార్టీలో చేర్చుకునే వ్యూహంతో రేవంత్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. అవసరం అయితే వారికి మంత్రి పదవులు కట్టబెట్టి జీహెచ్ఎంసీ పీఠం కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్లు కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. అదే నిజమయితే త్వరలోనే గ్రేటర్ పరిధిలోని మాజీ మంత్రులు తిరిగి మంత్రి పదవులు దక్కించుకోవడం ఖాయం. ఏది ఏమైనా అటు జీహెచ్ఎంసీ ఎన్నికలు కావచ్చు. మరో వైపు పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కావచ్చు ఆపరేన్ ఆకర్ష్ కు గేట్లు తీసిందనే చెప్పాలి. మరో వైపు బీఆర్ఎస్ దూకుడు తగ్గించేందుకు కూడా ఈ అస్త్రాన్ని రేవంత్ రెడ్డి ఉపయోగించే అవకాశం ఉంది. అదే అయితే రానున్న రోజుల్లో తమ ఎమ్మెల్యేలను బీఆర్ ఎస్ చీఫ్ కేసీఆర్ ఎలా నిలువరిస్తారో వేచి చూడాలి.

## ఈ నెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట: కేటీఆర్

రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాలు, పాఠశాలల్లో నెలకొన్న దుస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.



గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు పరిశీలించనున్నారని తెలిపారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మరణించారని.. ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఉన్నాయని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ముఖ్యమంత్రివిద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేదని.. ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని విమర్శించారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని అన్నారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీ వేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేశామని చెప్పారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ అధ్యయన కమిటీ బీఆర్ఎస్ పార్టీకి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. ఈ నివేదిక అంశాలను శాసనసభలో లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

## సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకండి

**హైదరాబాద్ :** మాదాపూర్ ఈదులకుంట చెరువుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఖానామెట్ విలేజ్ లో 6.5 గుంటల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈదులకుంట చెరువు శిఖాన్ని పూడ్చివేసి కొంతమంది బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువులోకి వర్షం నీటిని మోసుకువచ్చే నాలాను దారి మళ్లించి బిల్డర్లు కబ్జా చేసినట్లు తెలుసుకున్నారు.

**అక్రమ అనుమతులతో..**

పక్కన ఉన్న పట్ట భూమి సర్వే నెంబర్ తో డాక్యుమెంట్ సృష్టించి చెరువులో అనుమతులు తీసుకున్నారని.. అక్రమ అనుమతులతో బిల్డర్లు చెరువులో నిర్మాణాలు చేపట్టారని హైడ్రా కమిషనర్ గుర్తించారు. కూకట్పల్లి శేరిలింగంపల్లి రెవెన్యూ సరిహద్దుల్లో ఉన్న ఈదుల కుంటను సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులకు రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో ఆక్రమణలు చేసిన అక్రమార్కుల పాలిట హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేస్తోంది. భారీ యంత్రాలతో అక్రమంగా నిర్మాణించిన కట్టడాలను హైడ్రా సిబ్బంది నేల మట్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేస్తూ జీవో 99ను తీసుకువచ్చింది. రాష్ట్ర చరిత్రలోనే మూడున్నర నెలల వ్యవధిలో దాదాపు 300కు పైగా అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది.

## తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గితే కిరీటం ఏమీ పడిపోదు..

-మొదటిపేజీ తరువాయి
లగచర్లలో లడాయికి కారణమైన రేవంత్ రెడ్డి.. తన మొండి వైఖరి వల్లే నిన్న నిర్మల్‌లో ఇథనాల్ మంటలను రాజేశారని పేర్కొన్నారు. తలకు మాసిన ఆలోచనలతో రేపు రేవంత్ ఏ జిల్లాలోని.. ఏ పచ్చని పంట పొలాల్లో ఎలాంటి బాంబు పేలుస్తారోననే భయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరిలో వ్యక్తం అవుతుందని కేటీఆర్ అన్నారు.

ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవడం.. వారి మనోభావాలను గౌరవించడం అనేది పాలకుడి ప్రాథమిక విధి అని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ విషయాన్ని గుర్తెరిగి వెంటనే నిర్మల్ తరహాలోనే.. సొంత నియోజకవర్గంలో లగచర్ల సమరానికి ఫుల్ స్టాప్ పెట్టాలని సూచించారు. తప్పు ఒప్పుకుని వెనక్కి తగ్గినంత మాత్రాన సీఎం రేవంత్ రెడ్డి కిరీటం ఏమీ పడిపోదని విమర్శించారు. లేకపోతే జరిగే పరిణామాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## సీఎం సాబ్ సమాధానం చెప్పండి..



-మొదటిపేజీ తరువాయి
సందర్భంగా ప్రధానిని రిక్వెస్ట్ చేశామన్నారు కిషన్ రెడ్డి. ఇవాళ మోడీ టైమ్ ఇచ్చారని.. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయని ఆయన అడిగి తెలుసుకున్నారని తెలిపారు.

**ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలా?**

తెలంగాణలో ప్రాజెక్టుల అమలు కోసం సమర్థవంతంగా, ప్రొయాక్టివ్‌గా పనిచేయాలని ప్రధాని మోడీ సూచించారని కిషన్ రెడ్డి చెప్పారు. ప్రజాసమస్యల మీద ఎప్పుడూ దృష్టి పెట్టాలని.. ప్రభుత్వంతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలు ప్రశ్నలు వేశారు కిషన్ రెడ్డి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని క్వశ్చన్ చేశారు. సీఎం సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని సీరియస్ అయ్యారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంప్రదాయాన్ని ఈ ముఖ్యమంత్రి కూడా కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు.

**హామీలు మరిచారు**

రేవంత్ సర్కారు ఏడాది కాలం పూర్తి చేసుకుందని.. ఇకనైనా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని కిషన్ రెడ్డి సూచించారు. పాలన మీద దృష్టి పెట్టాలని తెలిపారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల వల్ల తెలంగాణ నష్టపోతోందని పేర్కొన్నారు. గతంలోని బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిందని ఫైర్ అయ్యారు కిషన్ రెడ్డి. హామీల అమలులో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. తూతూమంత్రంగా అమలు చేసినట్లు నటిస్తున్నారని విమర్శించారు. ఇంతవరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా రాలేదని.. ఎందుకు ఇవ్వలేదని క్వశ్చన్ చేశారు. రైతులు, రైతుకూలీలు, కౌలు రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు కిషన్ రెడ్డి. ఈ ప్రశ్నలకు రేవంత్ సమాధానం చెప్పి తీరాలన్నారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794